భారత
కమ్యూనిస్టు పార్టీ
(మార్క్సిస్టు)

# కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక

(ఏప్రిల్ 27-29, 2023 కేంద్రకమిటీ సమావేశం ఆమోదించినది)

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

# కొన్ని రాజకీయ పరిణామాలపై నివేదిక

*(ఏప్రిల్ 27-29, 2023 కేంద్రకమిటీ సమావేశం ఆమోదించినది)*

**23**వ పార్టీ మహాసభ జరిగి ఏడాది గడిచింది. ఈ కాలంలో జరిగిన పరిణామాలు మహాసభలో మనం నిర్దేశించుకున్న మార్గాన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఫాసిస్టు తరహా ఆరెస్సెస్ అనుసరించే హిందూత్వ ఎజెండా దూకుడు ఏ అడ్డంకి లేకుండా కొనసాగుతున్నది. కార్పొరేట్, మతోన్మాద బంధం నయా ఉదారవాద సంస్కరణలను బరితెగించి ముందుకు తీసుకుపోతున్నది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తూ, జాతిసంపదలను కొల్లగొడుతున్నది. రాజకీయ అవినీతి చట్టబద్ధం కావడంతో పాటు, పూర్తిస్థాయి నియంతృత్వం వెల్లడవుతున్నది. భారత రాజ్యాంగం దాడికి గురవుతున్నది. రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలు తీవ్రమైన దాడిని ఎదుర్కొంటున్నాయి. కేంద్ర సంస్థలు పాలకపార్టీ ఎజెండాను ముందుకు తీసుకుపోవడానికి ఒక ఇరుసులాగా ఉపయోగపడుతున్నాయి. అవి ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అమెరికాకు చిన్న తమ్ముడిలాగా దాని ప్రపంచ వ్యూహంతో భారత దేశం మరింతగా పెనవేసుకుంటున్నది.

## ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై అంచనాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. అనేక అంశాలు దాని స్థిరత్వంపై ప్రభావం చూపడంతో అది అంతకంతకు ఆర్థిక సంక్షోభం వైపు పయనిస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పెరుగుదల 3.4 శాతం నుండి 2023లో 2.8 శాతానికి పడిపోతుందని, 2024లో 3 శాతం వద్ద స్థిరపడుతుందని ఐఎంఎఫ్, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంచనాలు (ఏప్రిల్ 2023) తెలియచేస్తున్నాయి. అయినప్పటికీ, ఫైనాన్స్ రంగంలో ఇబ్బందుల మూలంగా ఆర్థిక

పెరుగుదల 2023లో 2.5 శాతానికి పడిపోవచ్చునని, దానితో ఆర్థిక మాంద్యం మరింత తీవ్రం కావచ్చునని కూడా చెప్పింది.

అభివృద్ధి చెందిన దేశాలలో ఈ ఆర్థిక క్షీణత మరీ ఎక్కువగా ఉంది. ఈ దేశాలలో ఆర్థిక పెరుగుదల రేటు 2022లో 2.7 శాతం నుండి 2023లో 1.3శాతానికి పడిపోనున్నది. ఫైనాన్స్ రంగ కల్లోలం, అధిక ద్రవ్యోల్బణం, ఉక్రేనియన్ యుద్ధ ప్రభావాలు, మూడేళ్ల కరోనా మహమ్మారి ప్రభావాలు వంటి వాటిని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు అని ఐఎంఎస్ పేర్కొంటున్నది.

## ఫైనాన్స్‌రంగ కల్లోలం: నయా ఉదారవాద దివాళాకోరుతనం

అమెరికాలో మూడు బ్యాంకులైన సిలికాన్ వాలీ బ్యాంక్ (ఎస్‌విబి), ఫస్ట్ రిపబ్లికన్ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ కుప్పకూలాయి. ఎంతో ప్రతిష్ట కలిగిన క్రెడిట్ సూయిస్ సైతం దాని షేర్‌ధర కుప్పకూలిపోవడంతో దాని ప్రత్యర్థి అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (యుబిఎస్) చేత స్వాధీనం చేసుకోబడింది.

ఈ కల్లోలానికి మూల కారణం వడ్డీరేట్లు పెరగడం. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వడ్డీరేట్లు పెంచబడినాయి. ఇది నయా ఉదారవాదం సూచించే పరిష్కారం. అత్యధిక బ్యాంకులు తమ ఆస్తుల్లో పెద్దభాగాన్ని బాండ్ల రూపంలో కలిగిఉన్నాయి. వడ్డీరేట్లు పెరిగితే బాండ్ల విలువ పడిపోతుంది. దీంతో బ్యాంకుల ఆస్తుల విలువ తగ్గి, వాటి ఆస్తులకు, అప్పులకు వ్యత్యాసం మరింత పెరిగి ఆ బ్యాంకులు ఇబ్బందికర పరిస్థితిలో పడిపోతాయి. దీన్ని ఎదుర్కొనడానికి బ్యాంకులు తీసుకునే చర్యలు బ్యాంకులు ఇబ్బందుల్లో పడతాయి. దీంతో ప్రజలు ఆ బ్యాంకులను వీడటం ఆరంభిస్తారు. బ్యాంకు షేర్లు పడిపోతుంటే ప్రజలు తమ డిపాజిట్లను ఉపసంహరించుకోవడం మొదలెడతారు.

## ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం:

అమెరికా తన ప్రపంచాధిపత్యాన్ని పెంచుకోవడానికి నాటోను తూర్పు దిశగా రష్యా పొలిమేరల వరకు విస్తరించింది. దానికి ప్రతిస్పందనగా రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆరంభించింది. ప్రపంచ సరఫరా గొలుసులు తెగిపోయి ద్రవ్యోల్బణం పెరగడానికి దారితీసిన పలు కారణాలలో అతి ముఖ్యమైనది ఉక్రెయిన్ యుద్ధం. అంటే ద్రవ్యోల్బణం పెరగడానికి ఆర్థికాంశాలు ఒక్కటే కాకుండా అమెరికా ప్రపంచాధిపత్య పథకాలు కూడ కారణమే.

నయా ఉదారవాద వ్యవస్థలో ద్రవ్యోల్బణం వడ్డీ రేట్ల పెంపుదల ద్వారా అదుపు చేయబడుతుంది. వడ్డీ రేట్లు పెరిగినపుడు ప్రాథమిక ఉత్పత్తులకు గిరాకీ తగ్గిపోయి ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుంది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం ఉత్పత్తి కార్యకలాపాలను తగ్గించి వేస్తుంది. ఫలితంగా నిరుద్యోగం రేటు పెరిగిపోతుంది. జీవన వ్యయం పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచబడవు. దీంతో ఆర్థిక వ్యవస్థలో గిరాకీ పడిపోయి ద్రవ్యోల్బణం తగ్గిపోతుంది.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 2022లో అమెరికాలో వడ్డీరేటు 0.25 శాతం ఉండేది. ఫిబ్రవరి 2023 నాటికి అది విపరీతంగా 4.75 శాతానికి పెంచబడింది. సాధారణంగా వడ్డీ రేట్లు చాల స్వల్పంగా తగ్గించబడతాయి, లేదా పెంచబడతాయి. అలా వడ్డీ రేటు స్వల్పంగా పెరిగినా, తగ్గినా ఫైనాన్స్ రంగంలో అలజడి సృష్టించబడదు. కాగా మనం ఇప్పుడు చెప్పుకుంటున్న కొద్దికాలంలో వడ్డీ రేట్లు విపరీతంగా పెరగడం, బ్యాంకులు సర్దుబాటు చేసుకొని దివాళా తీయకుండా జాగ్రత్త పడటాన్ని అసాధ్యం చేసింది. అందుచేత మూడు అమెరికా బ్యాంకులు కుప్పకూలడం తోనో, క్రెడిట్ సూయిస్‌తోనో ఆగేది కాదు. ఈ ఫైనాన్స్ రంగ కల్లోలం ఐఎంఎఫ్ హెచ్చరించినట్లు ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారితీసే అవకాశం ఉంది.

### డాలరు రూపంలో చెల్లింపుల నుండి ఉపసంహరణ :

తనపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలకు ప్రతీకారంగా, రష్యా తాను పలు దేశాలకు సరఫరా చేసే చమురుకు డాలర్ల రూపంలో చెల్లింపులు అవసరం లేకుండా రూబుళ్ళలోనే చెల్లింపులు జరిపే అవకాశాన్ని కల్పించింది. ఉక్రెయిన్ యుద్ధం మూలంగా ప్రపంచ సరఫరా గొలుసులు తెగిపోయి ద్రవ్యోల్బణం పెరగడంతో అమెరికా అనుసరించే ద్రవ్య విధానాలు ప్రపంచ ఫైనాన్స్ మార్కెట్‌లో ఇబ్బందులు పెరిగిపోయే పరిస్థితిని కల్పించాయి. దీంతో చాల వర్ధమాన దేశాలు కుంటుతూ నడుస్తున్న డాలరు వ్యవస్థతో తెగతెంపులు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. స్థానిక కరెన్సీలతో వాణిజ్యం నెరపడానికి అనేక దేశాలు అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో చైనా తన కరెన్సీ రెన్మిన్‌బి (ఆర్ఎంబి) పాత్రను మరింత పెద్దఎత్తున పెంచుకునే అవకాశాన్ని చేజిక్కించుకున్నది. బ్రెజిల్, చైనాలు తమ మధ్య వాణిజ్యాన్ని స్థానిక కరెన్సీలతో నిర్వహించడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. అమెరికా విధించిన తీవ్ర ఆర్థిక ఆంక్షల మూలంగా డాలరు ఆధిపత్య ప్రపంచ ఫైనాన్స్ మార్కెట్‌లతో సంబంధం కోల్పోయిన ఇరాన్, వెనిజులా దేశాలు కూడ ఇదేవిధంగా ఒప్పందాల కోసం ప్రయత్నిస్తున్నాయి.

ద్వైపాక్షిక లావాదేవీల్లో  ఆర్ఎంబిని వినియోగించడాన్ని ప్రోత్సహించేందుకు చైనా పలు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, బహుళపక్ష లావాదేవీల్లో చెల్లింపుల వాహకంగా డాలరు స్థానాన్ని ఆక్రమించే శక్తి చైనా ఆర్ఎంబి కి లేదు. డాలరు అనేది అంతర్జాతీయ లావాదేవీల చెల్లింపులకు, సంపద నిల్వకు వాహకంగా అత్యంత ఆధిపత్య స్థానంలో ఉండటం కొనసాగుతూనే ఉంది. ప్రపంచ ఫైనాన్స్ మార్కెట్లలో రోజువారీ లావాదేవీలు 7.5 లక్షల కోట్ల డాలర్లగా ఉన్నాయి. సమీప భవిష్యత్తులో డాలరు ఆధిపత్య స్థానాన్ని మరే ఇతర కరెన్సీ ఆక్రమించజాలదు. అయితే డాలరు స్థానాన్ని బలహీనపరచడం మాత్రం చేయవచ్చు. కొంత కాలానికి చాల వర్ధమాన దేశాలు ప్రత్యేకించి ఆసియా దేశాలు చైనా ఆర్ఎంబి ని స్థానిక కరెన్సీగా పరిగణించే అవకాశం కచ్చితంగా ఉంది.  అలాగే ఐరోపాలో యూరో ఉంటుంది. ఇక మిగతా ప్రపంచంలో అమెరికా డాలరు ఆధిపత్యమే కొనసాగుతుంది.

## రష్యా ఇంధన సరఫరాలు మరో మార్గానికి మళ్లింపు

మొదట రష్యానుండి చమురు దిగుమతులు రూబుల్ – రూపాయి మారకం ద్వారా చౌకగా లభిస్తున్నాయని చెప్పి భారతదేశం వాటిని పెంచుకుంటూ వచ్చింది. ఫలితంగా రష్యానుండి అత్యధిక చమురు దిగుమతి దేశంగా మనం ఉన్నాము. 2023 ఏప్రిల్ లో రష్యా ముడి చమురు ఎగుమతుల్లో 50 శాతానికి పైగా భారత దేశానికే వచ్చాయి. రష్యానుండి చమురు దిగుమతి చేసుకున్న దేశాలలో భారత్‌ది మొదటి స్థానం అయితే, చైనాది రెండవ స్థానం. అమెరికా ఆంక్షల మూలంగా తన చమురు అమ్మకాలు తగ్గలేదని, వేరే మార్గాల ద్వారా సరఫరా చేస్తున్నానని రష్యా చెప్పింది. 2022లో భారత దేశానికి రష్యా చమురు అమ్మకాలు 22 రెట్లు పెరిగాయి. కెప్లర్ సమాచారం ప్రకారం ఐరోపాకు భారత దేశపు డీజిల్ ఎగుమతులు 16 శాతం పెరిగాయి. మన గ్యాసు, చమురు ఎగుమతుల్లో ఈ ఎగుమతులు 30 శాతంగా ఉన్నాయి. అంతకు ముందు సంవత్సరం 21 శాతంగా ఉండేవి. అంతేకాకుండా, భారత దేశపు జెట్ ఇంధన ఎగుమతుల్లో 50 శాతం ఐరోపాకే జరుగుతున్నాయి. ఆసక్తికరమైన విషయమేమంటే, గ్యాసోలీన్, డీజిల్‌ల తయారీలో ప్రాసెస్ చేయడానికి ఉపయోగించే వ్యాక్యూమ్ గ్యాస్ ఆయిల్ (విజిఓ) ఎగుమతులు భారత దేశం నుండి అమెరికాకు రోజుకి 12,000 బ్యారెళ్ళకు పెరిగాయి. 2020–21లో ఈ ఎగుమతులు రోజుకు 500 బ్యారెళ్ళు మాత్రమే ఉండేవి.

క్లుప్తంగా చెప్పాలంటే, రష్యా చమురు ఎగుమతుల ఆదాయాన్ని దెబ్బకొట్టడానికి ఆ దేశంపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఫలితంగా ఐరోపా

యూనియన్‌కు, అమెరికాకు చమురు సరఫరా గొలుసులో ఏర్పడిన అవరోధాలను అధిగమించడానికి రష్యా చమురును దిగుమతి చేసుకొని తిరిగి ఎగుమతి చేయడానికి తటస్థ ప్రాంతాలుగా ప్రధానంగా భారత దేశం, కొంత మేరకు చైనా ఉపయోగపడుతున్నాయి. ఈ క్రమంలో భారత దేశంలోని చమురు రిఫైనరీలు, మోడీ సన్నిహిత ఆశ్రిత పెట్టుబడిదారీ సంస్థ రిలయన్స్ భారీ లాభాలను ఆర్జించాయి.

## కృత్రిమ మేథస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)

పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలను మరింతగా పెంచుకునేందుకు వీలు కల్పించేలా ఉత్పత్తి ప్రక్రియలో శారీరక, మానసిక శ్రమను తొలగించేందుకు ఒక సాధనంగా కృత్రిమ మేథస్సు రూపొందించబడింది. ఈ కృత్రిమ మేథస్సు శ్రామికులను భారీగా తగ్గించి వారిని మరిన్ని కష్టాలలో పడవేస్తుంది. దోపిడీని తీవ్రతరం చేస్తుంది. ఇటీవల కాలంలో దీన్ని వేగంగా అభివృద్ధి చేసి ప్రవేశపెట్టడం ఇంతకు ముందు వూహించని రంగాలలో కూడా ప్రభావం చూపుతున్నది. అలాంటి ప్రభావాల గురించిన ఇంకా సరైన అంచనా వేయాల్సి ఉంది. ఇలాంటి కృత్రిమ మేథస్సు యొక్క ఆశించని, ప్రమాదకరమైన పర్యవసానాలను అదుపు చేయడానికి ఒక అంతర్జాతీయ నియంత్రణ వ్యవస్థను తక్షణం రూపొందించాల్సిన అవసరం ఉంది.

దీని ప్రభావం ఇప్పటికే, ప్రత్యేకించి సమాచార సాంకేతిక (ఐటి) రంగం లాంటి సర్వీసు రంగాలలో కనిపిస్తున్నది. దీని మూలంగా ఉద్యోగులు తొలగించబడుతున్నారు. భారత దేశంలోని ఐటి రంగ కార్యకలాపాలలో కూడ ఈ ప్రభావం కనిపిస్తున్నది. బడా ఐటి రంగ కంపెనీలు గణనీయమైన సంఖ్యలో ఉద్యోగులను తొలగించినట్లు వార్తలు అందుతున్నాయి.

## ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్న నిరసనలు

నిజవేతనాలు తగ్గటం, నిరుద్యోగం పెరుగుదల, జీవన వ్యయ సంక్షోభానికి వ్యతిరేకంగా ఐరోపా అంతటా కార్మికవర్గ ప్రతిఘటన పెరుగుతున్నది. ఇంధన ధరల పెంపు, పెరుగుతున్న జీవన వ్యయం, పెన్షన్ చట్టాల సవరణ, పొదుపు చర్యలు వంటి అంశాలకు వ్యతిరేకంగాను **జర్మనీ, బెల్జియం, బల్గేరియా, స్లొవేకియా, ఇటలీ, పోలండ్, చెక్ రిపబ్లిక్, స్పెయిన్** లలో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

జీవన వ్యయ సంక్షోభానికి వ్యతిరేకంగా, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ **బ్రిటన్**లో సమ్మెచేయని కార్మిక వర్గ సెక్షను అంటూ ఏదీ లేదు. 75 ఏళ్ల

బ్రిటిష్ నేషనల్ హెల్త్ సర్వీసు చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆరోగ్య సర్వీసు సిబ్బంది పెద్దఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. పారిశ్రామికరంగ కార్మికులే కాకుండా, విద్యారంగానికి చెందిన, ప్రజా, వాణిజ్య సర్వీసులు, పాస్‌పోర్టు సర్వీసులకు సంబంధించిన సిబ్బంది కూడ సమ్మెల్లో పాల్గొన్నారు.

**ఫ్రాన్స్‌లో నిరసనలు:** మాక్రన్ ప్రభుత్వం తెచ్చిన పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ కార్మికవర్గం తీవ్రమైన నిరసన ప్రదర్శనలను నిర్వహిస్తున్నది. అన్ని రంగాలకు చెందిన కార్మికులు, ఫ్రాన్స్‌లోని అన్ని ప్రధాన నగరాలలో సమ్మెలు చేస్తున్నారు, బ్రహ్మాండమైన ప్రదర్శనలు చేస్తున్నారు. వీటిలో లక్షలాది కార్మికులు పాల్గొంటున్నారు. కార్మికుల డిమాండ్లు పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా ముందుకు సాగుతున్నది. ఈ సంస్కరణలను ముందుకు నెట్టడానికి అరుదైన రాజ్యాంగ అధికారాన్ని కూడా వినియోగించింది. పోలీసులను పెద్దఎత్తున రంగంలోకి దించి, విచక్షణారహితంగా కార్మికులను అరెస్టు చేశారు. ప్రదర్శకులపై క్రూరంగా అణచివేతను ప్రయోగిస్తున్నది. విద్యార్థులు, యువత కూడ ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. కార్మికులకు సంఘీభావంగా చాలా స్కూళ్లు మూతపడ్డాయి. ప్రభుత్వం కనుక తన చర్యను వెనక్కితీసుకోకపోతే మరింత విస్తృతమైన, తీవ్రమైన నిరసనలను ఎదుర్కోవలసి ఉంటుందని ట్రేడ్‌యూనియన్లు హెచ్చరించాయి. ఏప్రిల్ 20న, ఏప్రిల్ 28న దేశవ్యాపిత సమ్మెకోసం పిలుపు ఇచ్చారు. మే 1 న అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరపాలని పిలుపు ఇచ్చారు. పెన్షన్ సంస్కరణలకు మద్దతు ఇచ్చే కంజర్వేటివ్ పార్టీ సైతం కార్మికులతో ప్రభుత్వం సంప్రతింపులు జరపాలని డిమాండ్ చేయక తప్పలేదు.

తమ హక్కుల రక్షణ కోసం, జీవన పరిస్థితుల మెరుగుదల కోసం **పోర్చుగల్**లో కార్మికులు సమ్మె చేశారు. రవాణా, కమ్యూనికేషన్లు, ఆహారం, వ్యవసాయం, మెటలర్జీ, ఆటోమొబైల్ పరిశ్రమ, షిప్ బిల్డింగ్, ఇంధనం, కన్‌స్ట్రక్షన్, టెక్స్‌టైల్, ఆరోగ్య, వాణిజ్య, సామాజిక, మీడియా తదితర అన్ని రంగాలలోను సమ్మెలు, పని నిలుపుదలలు, ర్యాలీలు, ప్లీనరీ సమావేశాలు, పాదయాత్రలు, ప్రదర్శనలు జరిగాయి. వీటిలో టీచర్లు నిర్వహించిన పోరాటాలు ప్రముఖమైనవి. వీరితోపాటు బోధనేతర సిబ్బంది, డాక్టర్లు, జుడిషియల్ అధికారులు, నర్సులు, స్థానిక సంస్థల ఉద్యోగులు, భద్రతా దళాలు, సర్వీసులకు సంబంధించిన వారు కూడ నిరసనల్లో పాల్గొన్నారు.

**గ్రీసు**లో వ్యవసాయక రైతులు, పశుపోషక రైతులు దేశవ్యాపితంగా పలు ప్రాంతాలలో ట్రాక్టర్లను మోహరించి రహదార్లను దిగ్బంధనం చేశారు. ఉత్పత్తి వ్యయం కన్నా తక్కువకు అమ్ముకున్న ఉత్పత్తులకు నష్టపరిహారం చెల్లించాలని, ఉత్పాదక

పెట్టుబడుల వ్యయం తగ్గించాలని, కనీస ధరలకు గ్యారంటీ ఉండాలని, ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణ కల్పించాలని, ఇన్సూరెన్స్ విధానాల నియంత్రణలో మార్పులు తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

బెల్జియం ఫ్లాండర్స్ ప్రాంతం (ఉత్తర బెల్జియం) లో రైతులు తమ జీవన భృతిని దెబ్బతీసే విధంగా నైట్రోజన్ ఉద్గారాలను అదుపు చేయాలన్న ప్రభుత్వ పథకానికి వ్యతిరేకంగా వివిధ ప్రాంతాల నుండి ట్రాక్టర్ల ద్వారా తరలివచ్చి, వ్యవసాయ పరికరాలను రోడ్లపైకి తెచ్చి దిగ్బంధనం చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన చర్య అమలైతే రైతులు తమ వద్ద ఉన్న పశువుల సంఖ్యను తగ్గించుకోవలసి వస్తుంది. **నెదర్లాండ్స్**లో కూడ ఇలాంటి ప్రభుత్వ ప్రతిపాదనలను వ్యతిరేకించి రైతులు ప్రదర్శనలు నిర్వహించారు.

**కజకిస్తాన్**లో నయా ఉదారవాద సంస్కరణలకు వ్యతిరేకంగా, ప్రభుత్వం వాగ్దానం చేసిన చర్యలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చమురు రంగ కార్మికులు ఏప్రిల్‌లో సమ్మె చేశారు. దేశం పశ్చిమ ప్రాంతంలో పలు ప్రాంతాలలో జరిగిన ఈ ప్రదర్శనలు, నిరసన ర్యాలీలలో నిరుద్యోగ యువత కూడ పాల్గొన్నారు.

## ఉక్రెయిన్ యుద్ధం

ఉక్రెయిన్‌లో యుద్ధం కొనసాగుతూనే ఉంది. పార్టీ 23వ మహాసభ చెప్పినట్లు ఇది అమెరికా/నాటోలకు, రష్యాకు మధ్య ఉక్రెయిన్‌లో జరుగుతున్న యుద్ధం. 2022 ఫిబ్రవరి 24న ఈ యుద్ధం ప్రారంభం అయినపుడు రష్యాపై విస్తృతమైన ఆంక్షలు విధించాలన్నది  పాశ్చాత్య దేశాల తక్షణ ప్రతిస్పందన. ఈ ఆంక్షలు రష్యాపై తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని అమెరికా ప్రభుత్వం విశ్వసించింది. ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఉటంకిస్తూ 2022 మే 24న అమెరికా విడుదల చేసిన 'వాస్తవ పత్రం' ఇలా పేర్కొంది: "2022లో రష్యా ఆర్థిక వ్యవస్థ 15 శాతం లేదా ఇంకా ఎక్కువ క్షీణిస్తుంది. తగ్గిపోయిన జిడిపి గత 15 సంవత్సరాలలో రష్యా సాధించిన ఆర్థిక విజయాలను  తుడిచివేస్తుంది."  కానీ తాజా ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2022లో రష్యా ఆర్థిక వ్యవస్థ కేవలం 2.1 శాతం మాత్రమే కుదించుకుపోయింది.

అమెరికా ప్రభుత్వం ఉక్రెయిన్‌కు 3170 కోట్ల డాలర్ల రక్షణ సహాయాన్ని అందించడానికి అంగీకరించింది. 2022, 2023 ఆర్థిక సంవత్సరాలలో రక్షణ సహాయ ప్యాకేజీలకు నిధులు 4870 కోట్ల డాలర్ల సప్లిమెంటరీ అప్రోప్రియేషన్ ద్వారానే సమకూర్చబడ్డాయి.

## ఇజ్రాయిల్, పాలస్తీనా

**ఇజ్రాయల్‌లో నిరసనలు:** బెంజిమన్ నెతన్యాహు నాయకత్వంలోని అతి మితవాద ప్రభుత్వం ఉద్దేశించిన జ్యుడీషియరీ సంస్కరణలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ అంతటా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సంస్కరణల ద్వారా ప్రభుత్వం న్యాయమూర్తుల నియామకాన్ని అదుపు చేస్తుంది. సుప్రీంకోర్టు నిర్ణయాలను పార్లమెంటు తిరస్కరించవచ్చు. అంటే ఈ సంస్కరణలు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిపై దాడిచేయడమే. ఈ నిరసనల్లో ట్రేడ్ యూనియన్లు కూడ పాల్గొన్నాయి. చాలాకాలం తర్వాత మొట్టమొదటిసారి దేశవ్యాపిత సమ్మె జరిగి రవాణా, విద్యాసంస్థలు, రెస్టారెంట్లు, వాణిజ్య కార్యకలాపాలు స్తంభించిపోయాయి. లక్షలాదిమంది ఇజ్రాయిల్ ప్రజలు నెలల తరబడి ఈ న్యాయ సంస్కరణల ప్రతిపాదనలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని నెతన్యాహు ఈ ప్రతిపాదనలను స్తంభింపచేస్తానని చెప్పినప్పటికీ, వాటిని పూర్తిగా ఉపసంహరించుకోవలసిందే అంటూ ప్రజలు తమ నిరసనలను కొనసాగిస్తున్నారు.

**పాలస్తీనీయులపై దాడులు:** నిరసన ప్రదర్శనలు చేస్తున్న ప్రజల దృష్టిని మళ్ళించడానికి మితవాద ప్రభుత్వం పాలస్తీనీయులపై దాడులను అధికం చేసింది. చట్టవిరుద్ధ యూదు సెట్లర్లు పెంచి పోషించే ప్రైవేటు సాయుధ ముఠాలు పాలస్తీనీయులను వారి ఇండ్ల నుండి వెళ్ళగొట్టే చర్యలకు ప్రభుత్వంలోని మంత్రులే బహిరంగంగా మద్దతు ఇస్తున్నారు. రంజాన్ మాసంలో జెరూసలేం లోని ఆల్ అక్సా మసీదు ప్రాంగణంపై ఇజ్రాయిల్ సాయుధ బలగాలు కావాలని దాడి చేశాయి. ఇప్పటివరకు ఈ ఏడాదిలో సగటున రోజుకి ఒకరి చొప్పున పాలస్తీనా పౌరులు సాయుధ దళాల చేతిలో హతులవుతున్నారు.

**ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి ప్రకటన:** ఆక్రమిత పశ్చిమ తీరంలో ఇజ్రాయిల్ సెటిల్ మెంట్లు నెలకొల్పడాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఫిబ్రవరి 22న ఒక ప్రకటనలో ఖండించింది. ఈ చర్య ఆ ప్రాంతంలో శాంతికి ప్రధాన అవరోధమని పేర్కొంది. ఈ సెటిల్‌మెంట్లను తక్షణం తొలగించాలని చట్టబద్ధంగా కట్టుబడి ఉండాల్సిన తీర్మానాన్ని భద్రతా మండలి చేయకుండా అమెరికా నిరోధించి ఉండవచ్చు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ప్రకటన ఇలా పేర్కొంది: "శాంతికి విఘాతం కలిగించే ఏకపక్ష చర్యలన్నింటిని భద్రతా మండలి గట్టిగా ఖండిస్తున్నది." "సెటిల్‌మెంట్ల నిర్మాణం, విస్తరణ, పాలస్తీనీయుల భూముల ఆక్రమణ, సెటిల్‌మెంట్లను

‘చట్టబద్ధం’ చేయడం, పాలస్తీనీయుల గృహాలను ధ్వంసం చేయడం, పాలస్తీనా పౌరులను వెళ్ళగొట్టడం” వీటన్నింటిని భద్రతా మండలి ఖండిస్తున్నది.

## సూడాన్

ఇక్కడ రెండు ప్రత్యర్థి ముఠాల మధ్య తీవ్రమైన హింసాత్మక సాయుధ ఘర్షణలు జరుగుతున్నాయి. ఒక ముఠా, అధ్యక్షుడు అబ్దల్ ఫతా ఆల్ బురాన్ నాయకత్వంలోని మిలిటరీ. రెండవ ముఠా, హెమెదితిగా తెలిసిన ఉపాధ్యక్షుడు మొహమ్మద్ హమదాన్ దగాలో నాయకత్వంలోని ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ అని పిలువబడుతున్న ప్రధాన పార్లమెంటరీ శక్తి.

సుదీర్ఘ కాలం పాలించిన నియంత ఒమర్ హసన్ ఆల్ బషీర్ ను కూలదోసిన 2019 సైనిక తిరుగుబాటులో బురాన్, హెమదితిలు ఇరువురూ పాలుపంచుకున్నారు. ఆ తర్వాత 2021లో పౌర ప్రభుత్వాన్ని కూలదోయడంలో ఇరువురు కుమ్మక్కయ్యారు. ఏదేమయినప్పటికీ, వీరిరువురి నాయకత్వంలోని సైనికులు ప్రజాస్వామ్య అనుకూల కార్యకర్తలపైన, అసమ్మతివాదులపైన దాడులు చేస్తూనే ఉన్నారు. ఇదే సమయంలో విదేశీ శక్తులు తమ తమ ప్రాంతీయ క్రీడలకు దోహదపడతారన్న ఉద్దేశంతో ఈ రెండు ముఠాలను పెంచిపోషిస్తూ వచ్చాయి.

అంతర్యుద్ధానికి దారితీసే ప్రమాదమున్న ఈ సాయుధ సంఘర్షణలకు మూలం సూడాన్‌లోని సహజసంపదలపై అదుపు సాధించడమే. సహెల్ ప్రాంతంలో సూడాన్ కీలక స్థానంలో ఉంది. అందుచేతనే అమెరికా, ఐరోపా యూనియన్, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు సూడాన్‌పై ఆసక్తి పెంచుకొని ఇక్కడి పరిణామాల్లో చురుగ్గా జోక్యం చేసుకుంటున్నాయి.

## చైనా: అంతర్జాతీయ పాత్ర

ఫిబ్రవరిలో చైనా తన ప్రపంచ భద్రతా చొరవను ప్రకటించింది. అంతర్జాతీయ ప్రపంచ వ్యవస్థలో బహుళపక్ష ప్రాధాన్యతను ఆ ప్రతిపాదన విపులీకరించింది. దీనిలో అంతర్జాతీయ ప్రపంచ వ్యవస్థ ప్రజాస్వామీకరణ చెందాలని చైనా పిలుపు నిచ్చింది. అధికార రాజకీయాల పట్ల, ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం పట్ల, ఆధిపత్యవాదం పట్ల తన వ్యతిరేకతను వెల్లడించింది. దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం, పరస్పర గౌరవం అంతర్జాతీయ శాంతికి కీలకమని తన వైఖరిని వివరించింది. ఈ అవగాహన ప్రాతిపదికన ఆఫ్రికాలోను,

లాటిన్ అమెరికాలోను చాలా దేశాలతో చైనా తన సంబంధాలను గాఢతరం చేసుకుంటున్నది.

ఈ అవగాహనకు అనుగుణంగా చైనా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి నెలకొనడానికి 12 సూత్రాల ప్రతిపాదన ఒక దానిని ముందుకు తెచ్చింది. ఈ ప్రతిపాదనలను రష్యా స్వాగతించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు కూడా ఈ ప్రతిపాదనలను శ్రద్ధగా పరిశీలిస్తానని చెప్పక తప్ప లేదు. వీటి గురించి చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్‌తో చర్చిస్తానని కూడా చెప్పాడు. ఈ నేపథ్యంలో పుతిన్, జీ జిన్ పింగ్‌ల మధ్య సమావేశం జరిగింది.

ఇదే సమయంలో చైనాను ఒంటరిపాటు చేయడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. అయినప్పటికి, చైనాకున్న ఆర్థిక శక్తి రీత్యా ఆ ప్రయత్నం దాదాపు అసాధ్యంగా మారింది. జర్మనీ చాన్సలర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఐరోపా యూనియన్ అధ్యక్షుడు ఇటీవల చైనా సందర్శించారు. వీరంతా నేటి ప్రపంచంలో చైనా పాత్ర అనివార్యతను అంగీరించారు. చైనా శాంతి ప్రతిపాదనలను తక్కువ చేసి చూపడానికి ప్రయత్నిస్తున్న అమెరికా వైఖరికి ఈ దేశాల వైఖరి భిన్నంగా ఉంది.

## సౌదీ అరేబియా– ఇరాన్ ఒప్పందం

చైనా మధ్యవర్తిత్వంతో సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య ఒక చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. పశ్చిమాసియాలో బలాబలాల పొందికలో మార్పు తీసుకురాగలిగిన పరిణామాలకు దారితీసే అవకాశం ఈ ఒప్పందానికి ఉంది. 2023, మార్చి 10న ఈ మూడు దేశాలు బీజింగ్ నుండి విడుదల చేసిన సంయుక్త ప్రకటన కింగ్‌డం ఆఫ్ సౌదీ అరేబియాకు, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు మధ్య ఒప్పందం కుదిరిందని, ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణ కూడ దీనిలో ఉందని పేర్కొంది. ద్వైపాక్షిక సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకు వెళ్ళే అంశంపై ఇరు దేశాల విదేశాంగ మంత్రులు చర్చిస్తారని చెప్పింది.

ఈ ఒప్పందం ప్రభావం ఈ ప్రాంతంలో ఇప్పటికే పడింది. గతంలో అమెరికా వత్తిడితో తొలగించబడిన సిరియాకు తిరిగి అరబ్ లీగ్‌లో స్థానం కల్పించడానికి ప్రాతిపదిక సిద్ధమయింది.

ఒక ఇరానియన్ వ్యాఖ్యాత దీనిని 'ఒక ఒప్పందం, ఏడు విజయాలు' అని అన్నాడు. ఆ ఏడు విజయాలు: సంప్రదింపులకు సిద్ధపడటం, ఇరాన్ ను ఒంటరిపాటు చేయాలన్న అమెరికా ప్రయత్నాల విఫలం, ఒప్పందానికి వ్యతిరేకంగా ఇజ్రాయల్

ప్రయత్నాల విఫలం, అమెరికాతో సంయుక్త సమగ్ర కార్యాచరణ పథకం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని ఇరాన్ ప్రజలను నమ్మించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాల విఫలం, పశ్చిమాసియా సంబంధాలలో చైనా విజయవంతంగా ప్రవేశించడం, రాజ్య మార్పిడి స్వప్నాల విఫలం.

**రష్యా – చైనా**

చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ 2023 మార్చి 20–22 తేదీల్లో రష్యా సందర్శించాడు. 2023లో జరిగిన నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన తర్వాత ఆయన మొట్టమొదటి అంతర్జాతీయ పర్యటన ఇదే.

చైనా రష్యాల మధ్య సంబంధాలు ఇరుదేశాలకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలిగించాయి. గత ఏడాది ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బాగా పెరిగింది. రష్యా ఎగుమతుల్లో దాదాపు మూడోవంతు చైనాకే జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో రష్యా చైనాకు అధిక చమురు ఎగుమతి చేసే దేశంగా తయారైంది. ఇరు దేశాలు ఇంధనం లాంటి రంగాలలోను, సరఫరాల్లోను సహకారాన్ని విస్తరించుకోవాలని పుతిన్‌తో సమావేశం అనంతరం జీ ప్రకటించాడు.

చర్చల ప్రారంభంలో కెమెరాల ఎదుట జీ తో మాట్లాడుతూ పుతిన్ చైనా ప్రతిపాదనలను 'జాగ్రత్తగా పరిశీలించాను.' 'శాంతి చర్చలకు సానుకూలంగా ఉన్నాము.' అని చెప్పాడు. చైనా 'నిర్మాణాత్మక పాత్రను' స్వాగతించాడు. చైనా ప్రతిపాదనలు రష్యా వైఖరి అనుగుణమైనవని, 'పాశ్చాత్య ప్రపంచం, ఉక్రెయిన్ సిద్ధపడితే' తుదకు శాంతి ఒప్పందానికి ప్రాతిపదికను రూపొందిస్తాయని పుతిన్ చెప్పాడు. జీ పర్యటన అనంతరం సంయుక్త ఆర్థిక సహకార ఒప్పందం విడుదలైంది. ఇరు దేశాలు డాలరు కాకుండా చైనా యువాన్ లాంటి స్థానిక కరెన్సీ వినియోగాన్ని పెంచుకోవాలని ఈ ఒప్పందం పేర్కొంది. చమురు, సహజవాయువుతో సహా సరిహద్దుమీదుగా జరిగే వాణిజ్యంలో దీన్ని అనుసరించాలని చెప్పింది.

**పాకిస్తాన్**

పాకిస్తాన్ ఇప్పుడు తీవ్రమైన సంక్షోభం మధ్యలో ఉంది. నిజానికి పాకిస్తాన్‌లో అనేక అంతఃసంబంధాలతో కూడిన పలు సంక్షోభాలు ఏకసమయంలో కొనసాగుతున్నాయి. పంజాబ్‌లో ఎన్నికలపై షెబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు

మధ్య విభేదాలు, గిరిజన ఖైబర్ ఫక్తున్‌ఖ్వా, ఎన్నికల నిధులకు సంబంధించి సుప్రీంకోర్టుకు, పార్లమెంటుకు మధ్య విభేదాలు, ప్రధాన న్యాయమూర్తి సుమోటో అధికారాలు, తన అభీష్టం ప్రకారం బెంచీలను ఏర్పాటుపై షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి, సుప్రీంకోర్టుకు మధ్య విబేధాలు, సార్వత్రిక కాల నిర్ణయంపై షెహబాజ్ షరీఫ్‌కు, ఇమ్రాన్‌ఖాన్‌కు మధ్య విభేదాలు ఈ సంక్షోభాలలో కొన్ని.

ఇవన్నీ కూడ ఆర్థిక వ్యవస్థ తీవ్ర దుస్థితిలో ఉండి, ద్రవ్యోల్బణం 40 శాతానికి పెరిగినపుడు తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పాకిస్తాన్ ఇప్పుడు మరొక బయటపడవేసే (బెయిలవుట్) పథకం కోసం ఐఎంఎఫ్‌తో సంప్రదింపులు జరుపుతున్నది. పాకిస్తాన్ స్టేట్ బ్యాంకు వద్ద విదేశీ మారక నిల్వలు 2021 అగస్టులో 2010 కోట్ల డాలర్లు ఉంటే, 2023 ఫిబ్రవరి నాటికి కేవలం 290 కోట్ల డాలర్లకు పడిపోయాయి. 2022లో కరెంటు ఖాతా లోటు 1740 కోట్ల డాలర్లుగా ఉంది. ఎగుమతుల కన్నా దిగుమతులు సుమారు 4500 కోట్ల డాలర్లు అధికంగా ఉన్నాయి. 110 కోట్ల డాలర్ల విడుదల కోసం ఐఎంఎఫ్‌తో పాకిస్తాన్ గత ఫిబ్రవరి ఆరంభం నుండి సంప్రదింపులు జరుపుతున్నది. ఐఎంఎఫ్ విధించిన అన్ని షరతులకు పాకిస్తాన్ అంగీకరించింది. ఇంధన ధరలు పెంచడం. పన్నులు పెంచడంతో సహా ఈ షరతుల్లో ఉన్నాయి. 'ప్రత్యామ్నాయం ఏదీ లేదు' కాబట్టి ఐఎంఎఫ్ విధించిన షరతులన్నింటినీ అంగీకరించాల్సిందే అని ప్రధాని బహిరంగంగా ప్రకటించాడు.

ప్రజలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయకుండా నిరోధించేందుకు రాజకీయ కేంద్రమైన లాహెూర్‌తో సహా దేశవ్యాపితంగా చాలా నగరాలలో ప్రజాప్రదర్శనలపై పూర్తి నిషేధం విధించారు. ఎన్నికలు జరగవలసిన పంజాబ్ రాష్ట్రంలో ఇమ్రాన్ ఖాన్ పిటిఐ పార్టీ భారీ ప్రదర్శనలు నిర్వహించింది. పాకిస్తాన్ ప్రభుత్వానికి పంజాబ్‌లో ఇప్పుడు ఎన్నికలు జరపడం ఇష్టం లేదు, సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. సుప్రీం కోర్టు ఎన్నికలకు తాను నిర్ణయించిన మే 10వ తేదీ మించి తాను పరిశీలించబోనని, ఈ లోగా అన్ని రాజకీయ పార్టీలు కూర్చొని ఎన్నికలకున్న సాధ్యాసాధ్యాలను చర్చించి ఒక నిర్ణయానికి రావాలని కోరింది.

ఆర్థిక దుస్థితి నుండి ప్రతిపక్షాలు లాభపడకూడదని భావించిన ప్రభుత్వం ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోని తెహ్రిక్-పాఇన్సాఫ్ (పిటిఐ) పార్టీపై ఎదురుదాడికి పూనుకొంది. ఇమ్రాన్‌ను అరెస్టు చేయడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు మార్చి నెలలో దేశవ్యాపిత నిరసనలకు దారితీశాయి. ఇమ్రాన్‌ను అరెస్టు చేయడాన్ని అడ్డుకున్న ప్రజలపై పోలీసులు పాశవికంగా విరుచుకుపడ్డారు.

**శ్రీలంక:**

రాజపక్సె ప్రభుత్వం రాజీనామా చేసి, కొత్త ప్రభుత్వం వచ్చేందుకు దోహదపడిన ప్రజా నిరసనలు, కొత్త ప్రభుత్వం తమ డిమాండ్లను అమలు చేయకపోవడంతో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జీవన వ్యయం విపరీతంగా పెరగడానికి నిరసనగాను, ఐఎంఎఫ్ బెయిల్ అవుట్ పథకం విధించిన పన్నుల పెంపుదలకు వ్యతిరేకంగాను ఆసుపత్రులు, స్కూళ్ళు, రైల్వేలలో పనిచేస్తున్న వేలాది కార్మికులు మార్చి నెలలో దేశవ్యాపితంగా సమ్మె చేశారు. ఈ నిరసనలను నిర్వహించడానికి 40 కి పైగా ట్రేడ్ యూనియన్లు ఒక్కటయ్యాయి. ప్రభుత్వం సమ్మెలపై నిషేధం విధించినప్పటికీ, ఉల్లంఘించిన వారి ఉద్యోగాలు వూడిపోతాయని బెదిరించినప్పటికీ లెక్కచేయకుండా ఈ సమ్మెలు జరిగాయి. ఐఎంఎఫ్ వద్ద నుండి 290 కోట్ల డాలర్ల రక్షణ ప్యాకేజీ పొందే అర్హత సాధించేందుకు కొత్తగా విధించిన పన్నులను ఉపసంహరించాలని, ఇంకా ఇతర షరతుల అమలును నిలిపివేయాలని నిరసనకారులు డిమాండు చేస్తున్నారు. అధిక వడ్డీ రేట్లను తగ్గించాలని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.

స్థానిక సంస్థలకు, రాష్ట్ర కౌన్సిళ్ళకు జరగాల్సిన ఎన్నికలను ప్రభుత్వం ఫిబ్రవరిలో వాయిదా వేసింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది దేశాన్ని కుదిపేసిన పోరాటాల అనంతరం వాగ్దానం చేసిన ప్రజాస్వామ్య ప్రక్రియను ఇది ఉల్లంఘించడమే అని ప్రజలు భావించారు. జెవిపి నాయకత్వంలోని నేషనల్ పీపుల్స్ పవర్ కూటమి పిలుపు మేరకు జరుగుతున్న నిరసన ప్రదర్శనలను చెదరగొట్టడానికి పోలీసులు బలప్రయోగం చేశారు. ఐఎంఎఫ్ ఆదేశాల మేరకు అమలవుతున్న పొదుపు చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులు కూడా రంగంలోకి దిగారు. ఎలాంటి ఎన్నికలు లేకుండా ఏర్పాటయిన కొత్త ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో ఉండటంతో, ఎన్నికలు జరపాలంటే ప్రభుత్వం భయపడుతున్నది.

**నేపాల్:**

నేపాలీ కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొన్న ప్రచండ (సిపిఎన్ మావోయిస్ట్ సెంటర్) ప్రధాని అయ్యేందుకు కెపి ఓలి (సిపిఎన్ యుఎంఎల్) తో చేతులు కలిపాడు. అయితే ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ప్రచండ మళ్ళీ తన పొత్తును మార్చుకున్నాడు. నేపాలీ కాంగ్రెస్ నేత షేర్ బహదూర్ దేవ్‌బా అభ్యర్థి

రామచంద్ర పౌడేల్ అధ్యక్షునిగా ఎన్నికయ్యేందుకు ప్రచండ ఇలా మారాడు. ఇలా వేగంగా రాజకీయ పొత్తులు మారిపోవడాన్ని కేంద్ర కమిటీ గత సమావేశంలోనే గుర్తించింది. ఇలాంటి మార్పులు ప్రచండ నాయకత్వంలోని ప్రభుత్వ స్థిరత్వం పైన, ఎక్కువ కాలం మనగలగడం పైన ప్రభావం చూపిస్తాయి.

## జాతీయ పరిస్థితి

### 1) దేశ ఆర్థిక పరిస్థితి :

దేశ జిడిపి 2021 ఆర్థిక సంవత్సరంలో 9.1శాతం, 2022లో 6.8శాతం, 2023 సం॥లో 6.1 శాతంగా అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐఎమ్ఎఫ్) అంచనా వేసింది. గత అంచనా కన్నా మరింత తగ్గి ఈ ఆర్థిక సంవత్సరంలో 5.9 శాతం మాత్రమే ఉంటుందని చెప్పింది.

మోడీ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి సజావుగానే ఉందని చెపుతున్నది. 2021లో 9.1శాతం వుండగా, 2020 సం॥లో అది మైనస్ 5.8 శాతంగా వున్న వాస్తవాన్ని ప్రభుత్వం మరుగున పరుస్తున్నది. కోవిడ్ మహమ్మారి ముందు సంవత్సరం, అంటే 2019 ఆర్థిక సంవత్సరం ప్రకారం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును పరిగణన లోకి తీసుకుంటే, దేశ వార్షిక వృద్ధిరేటు 3.8శాతం మాత్రమే. 2022, 2023 ఆర్థిక సంవత్సరాలలో భారతదేశం 350 బిలియన్ డాలర్ల సంపదను పెంచుకుంది. అదే సమయంలో అమెరికా 1390 బిలియన్ డాలర్లు, చైనా 1274 బిలియన్ డాలర్లు సమకూర్చుకున్నాయి.

ఐఎమ్ఎఫ్ ప్రకారం భారతదేశ జిడిపి పెరుగుతున్నదని చెపుతున్నప్పటికీ, దాని తలసరి ఆదాయం మాత్రం అతి తక్కువగా ఉంది. పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాలతో పోలిస్తే తలసరి ఆదాయంలో అమెరికా మన కంటే 31 రెట్లు, చైనా 5 రెట్లు, బ్రెజిల్ 4, యుకె 18, జర్మనీ 20 రెట్లు అధికంగా ఉన్నాయి. ఈ విధంగా ప్రపంచంలో 5వ అతిపెద్ద జిడిపి గల దేశంగా ఉన్నా, తలసరి ఆదాయంలో అంగోల, ఐవరీకోస్టు వంటి అతి చిన్న దేశాలకన్నా తక్కువగా ఉన్నాము.

**మౌలికసదుపాయాల రంగం :** మోడీ ప్రభుత్వం పెట్టుబడులు, మౌలికసదుపాయాల గురించి నిరంతరం ప్రచారం చేసుకుంటూ దీనినే ఆర్థిక అభివృద్ధికి సూచిగా చెపుతున్నది. 'గణాంకాలు మంత్రిత్వ శాఖ 2023' నివేదిక ప్రకారం, ఒక్క విద్యుత్తు ఉత్పత్తి, పెట్రోలు రిఫైనరీ ఉత్పత్తి రంగాలు మినహాయించి,

మిగిలిన అన్ని రంగాలు నిర్ధేశించుకున్న లక్ష్యాలను చేరడంలో వెనుకబడ్డాయని పేర్కొంది.

మౌలిక సదుపాయాల విభాగమంతా మొత్తంగా ప్రైవేటీకరణ చేసి ఆశ్రిత పెట్టుబడిదారులకు అంటే ముఖ్యంగా అదానీ వంటి వారికి ఇవ్వాలని చూస్తున్నది. ఈ దిశగా జాతీయ మోనిటైజేషన్ పైపులైన్ (ఎన్ఎమ్పి) దూకుడుగా పనిచేస్తోంది. అదే సమయంలో అటవీరక్షణ చట్టాల వంటి వాటికి సవరణలు తెచ్చి అటవీ భూములలో పెద్దఎత్తున బొగ్గు తవ్వకం ఇతర ఖనిజాల కోసం కేటాయిస్తున్నారు. భారతదేశ జాతీయ సంపద దోచుకోవడానికి నయా ఉదారవాద విధానాల ద్వారా 'బలవంతంగా కైవసం చేసుకుని తద్వారా సంపద పెంపొందించుకునే విధానాన్ని' అనుసరించడమే ఈ మొత్తం ప్రక్రియ.

**నిరుద్యోగం :** నిరుద్యోగం చాలా భారీ స్థాయిలో నమోదవుతున్నది. నిరుద్యోగం 7.14 నుండి 7.45కి పెరిగిందని సిఎమ్ఐఇ పేర్కొంది. అయితే ఉత్పత్తిలో కార్మికుల భాగస్వామ్యం 42.9 నుండి 39.8 శాతానికి తగ్గింది. ప్రతి ఏటా కార్మికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉపాధి అవకాశాల లేమితో ఎక్కువమంది ఉద్యోగాల కోసం ఎదురుచూడటం మానేసారు. కోవిడ్‌కు ముందు జనవరి 2020లో 41.1 కోట్లు ఉన్న ఉద్యోగుల సంఖ్య నిలకడగా జనవరి 2023లో 40.9 కోట్లుగా ఉంది.

**ఉపాధి హామీ కుదింపు** : నిరుద్యోగం పెరుగుతున్న ఈ సమయంలో, గ్రామీణ ప్రాంతంలో కోట్లాదిమంది యువతకు ఆశాకిరణంగా ఉన్న గ్రామీణ ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయింపులు 33 శాతానికి తగ్గించింది. దీనికి తోడు, ప్రభుత్వం నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్‌ను తప్పనిసరి చేసింది. ప్రభుత్వ నివేదిక ప్రకారం, ఇందులో సాంకేతిక లోపాల వల్ల కార్మికులు కనీసం సగం కూలీ నష్టపోతున్నారు. మహిళా కూలీలు స్మార్టు ఫోన్లు కొనడానికి అప్పులు చేయాల్సి వచ్చింది.

**ప్రపంచ పరిణామాల ప్రభావం :** ప్రపంచ ఆర్థిక మందగమనం వలన, రబ్బరు, జీడిపప్పు, పీచు లాంటి సాంప్రదాయ పంటలకు డిమాండ్, ధరలు తగ్గడంతో నిరుద్యోగిత మరింత పెరిగింది.

**గ్రామీణ ప్రాంత నిజవేతనాలలో స్తబ్ధత :** గత 8 సంవత్సరాల మోడీ పాలనలో 2014-15 సం॥ ధరల ప్రకారం అంచనా వేసిన నిజవేతనాలే నేటికీ వ్యవసాయ, వ్యవసాయేతర నిర్మాణ కార్మికులకు అమలులో ఉన్నాయి. 2014-15 నుండి 2021-22 వరక ద్రవ్యోల్బణం పెరిగినప్పటికీ నిజవేతనాలు వ్యవసాయ రంగంలో రు.225 నుండి రు.240లే వున్నాయి. వ్యవసాయేతర రంగంలో రు.234 నుండి రు.245గాను, నిర్మాణ రంగంలో రు.275 నుండి 280లే కొనసాగుతున్నాయి.

**అధిక ద్రవ్యోల్బణం :** నిజవేతనాల స్తబ్దతతో పాటు నిరుద్యోగం పెరుగుతుండటంతో ద్రవ్యోల్బణం రేటు మరింతగా పెరిగి విస్తారమైన ప్రజానీకంపై మరిన్ని భారాలు మోపబడ్డాయి. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకారం, ద్రవ్యోల్బణం 6శాతం లేదా అంతకన్నా ఎక్కువగా ఉండటం పట్టణ ప్రాంత పేదలపై తీవ్ర ప్రభావం పడింది.

తీవ్రమవుతున్న ప్రజల ఇబ్బందులు, ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వలన దేశం ఆర్థిక స్థితిగతి మందగిస్తున్నది. ఆర్థిక వ్యవస్థలో మార్పు వచ్చే విధంగా ప్రజల కొనుగోలు శక్తి పెరగనట్టయితే, ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం కష్టం.

**కేంద్ర బడ్జెట్ 2023-24** : కేంద్రబడ్జెట్‌లో ప్రభుత్వ ఖర్చు తగ్గించి అదే సమయంలో ధనవంతులకు పన్ను రాయితీలు ఇచ్చింది. సాధారణ లెక్కల ప్రకారం జిడిపి 10.5శాతంగా (ద్రవ్యోల్బణంతో కలిపి) పెరుగుతుందన్న అంచనాతో ప్రభుత్వ ఖర్చులు 7శాతం మాత్రమే పెంచింది. వాస్తవానికి ఇది తగ్గించడమే. బడ్జెట్‌లో ధనిక వర్గానికి రాయితీలు ఇవ్వటం వలన 35,000 కోట్ల ఆదాయం తగ్గింది. అదే సమయంలో బడ్జెట్‌లో ఆహార సబ్సిడీ 90వేల కోట్లు, ఎరువుల సబ్సిడీ 50వేల కోట్లు, పెట్రోలియం సబ్సిడీ 6900కోట్లు తగ్గించారు. ధనవంతులను మరింత సంపన్నవంతులుగా, పేదలను ఇంకా పేదవారిగా మార్చటంలో మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంలోని తర్కం ఇది.

## కార్పొరేట్ - మతతత్వ బంధం :

హిండెన్‌బర్గ్ పరిశోధన ద్వారా అదానీ గ్రూప్ తన కార్పొరేట్ సామ్రాజ్యాన్ని ఎలా విస్తరించిందో బహిర్గతం చేసింది. 2014 నుండి భారతదేశాన్ని పాలిస్తున్న మతోన్మాద బిజెపి, కార్పొరేట్‌లతో ఎలా కుమ్మక్కయి పని చేస్తున్న తీరును ఇది తెలియజేసింది. బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల నుండి వేలకోట్ల ప్రజలడబ్బును పెద్ద మొత్తంలో తన ఆశ్రితులకు ఎలా బదిలీ చేసిందో బట్టబయలు చేసింది.

2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు అదానీ సంస్థకు పెట్టుబడులు 7.1 బిలియన్లు (ఫోర్బ్స్ పత్రిక ప్రకారం). ఇది 2022 నాటికి 200 బిలియన్లకు పెరిగింది. అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో అదానీ 2014లో 609వ స్థానంలో ఉండగా 2022 నాటికి ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్నమైన పెట్టుబడిదారుడిగా ఎదిగాడు. ప్రస్తుతం 7 పబ్లిక్ లిస్టెడ్ కంపెనీలు, 578 అనుబంధ సంస్థలు ఉన్నాయి. గ్లోబల్ ఎనర్జీ మానిటర్ ప్రకారం, ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు

పరిశ్రమ యజమాని. భారతదేశంలో 8 విమానాశ్రయాలు మరియు 13 సముద్ర ఓడరేవులను నిర్వహిస్తున్నది. బొగ్గు గనులు, చమురు మరియు గ్యాస్ అన్వేషణ, గ్యాస్ పంపిణీ, విద్యుత్ ప్రసారం మరియు పంపిణీ, పౌర నిర్మాణం, మౌలిక సదుపాయాలు, ఆహార నిల్వ, విద్య, రియల్ ఎస్టేట్, వంట నూనెలు వంటి అంతర్జాతీయ వాణిజ్య రంగాలలో పెద్దఎత్తున పెట్టుబడులు ఉన్నాయి.

ఈ కాలంలో అదానీ కంపెనీలకు మోడీ ప్రభుత్వం నుండి పెద్ద మొత్తంలో ప్రయోజనాలు దక్కాయి. ప్రభుత్వ భూములు కారుచౌకగాను, వాతావరణంపై ప్రతికూల ప్రభావం చూపే సంస్థలకు పర్యావరణ అనుమతులు, జాతీయ బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణాల పంపిణీ, ఇతర కార్పొరేట్ల ఆస్తులు పొందటానికి ప్రభుత్వ సహాయం, విదేశాల్లో బొగ్గు గనులు, ఓడరేవులు మొదలైనవాటిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వ పరపతి ఉపయోగించడం మొదలైనవి. స్టాక్ మార్కెట్ చట్టబద్ధ నిబంధనలేవీ అక్కరకు రాలేదు. ఎటువంటి ఆరోపణలూ పట్టించుకోలేదు.

**దుర్మార్గ ప్రయోగం :** ప్రభుత్వం చేసిన దోపిడీ, దుశ్చర్యలు కార్పొరేట్లతో వున్న సంబంధాన్ని బహిరంగ పరిస్తే, దానిని జాతి, దేశం మీద దాడిగా ప్రచారం చేస్తున్నది. గుజరాత్ మత మారణకాండపై బిబిసి డాక్యుమెంటరీలో మోడీ ప్రభుత్వ నిర్వాకాన్ని సూటిగా ప్రశ్నించినందుకు దానిని నిషేధించింది. భారతదేశంలో సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కాకుండా అడ్డుకున్నది. వీటిని “వలసవాదుల” ఉత్పత్తులుగా వర్ణిస్తూ భారత వ్యతిరేకం అంటూ నిషేధించింది. ఇదేవిధంగా హిండెన్‌బర్గ్ రిపోర్టు ప్రజలలోకి రాగానే అదానీ గ్రూపు దీనిని ‘దేశం మీద దాడి’గా అభివర్ణించింది. మోడీ–అదానీ–మైత్రి కార్పొరేట్ మతపర ఐక్యతగా వుందనడానికి ఇది నిదర్శనం. అదానీ గ్రూపు జాతీయ సంపదను దోచుకోవడంపై పార్లమెంటరీ కమిటీ వేసేందుకు మోడీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది.

**మోసపూరిత ప్రచారం :** మోడీ అదానీలపై దాడి దేశం మీద దాడిగా చిత్రీకరించడానికి, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. తనకు 140 కోట్ల భారతీయుల మద్దతు ఉందని పార్లమెంటుకి జవాబుదారీ కాదని చెపుతున్నది. మొత్తం 61కోట్లలో 23కోట్ల మంది (37.7శాతం) ఓటర్లు మాత్రమే బిజెపికి ఓటువేస్తేనే మోడీ ప్రధాని అయ్యారు. ఓటింగ్ అర్హత ఉన్న 91కోట్లలో బిజెపి భాగం 25శాతం మాత్రమే. ఈమధ్య జరిగిన ఎన్నికలలో బిజెపి గుజరాత్‌ని నిలబెట్టుకున్నప్పటికీ, అధికారంలో ఉన్న హిమాచల్‌లో ఓడిపోయింది. అంతేగాక 15ఏళ్ళుగా పాలిస్తున్న ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్‌ను పోగొట్టుకుంది.

మూడు ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండు, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో, 180 సీట్లకుగాను బిజెపి 46 సీట్లు మాత్రమే గెలిచింది. త్రిపురలో 46 నుండి 32 అసెంబ్లీ స్థానాలకు తగ్గింది. నాగాలాండులో అది 12 సీట్లు గెలిచింది. మేఘాలయాలో 2 సీట్లు మాత్రమే గెలవగలిగింది. మిగిలిన 58 సీట్లలో డిపాజిట్ కోల్పోయింది. పోలైన ఓట్లలో, బిజెపి త్రిపురలో 38.97 శాతం, నాగాలాండ్‌లో 18.81 శాతం, మేఘాలయాలో 9.33శాతం మాత్రమే వచ్చాయి. అయితే, ప్రాంతీయ పార్టీలను కూడగట్టి ఈ మూడు రాష్ట్రాలలో బిజెపి అధికారంలోకి వచ్చింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పూనాలోని కస్బాపేటలో కాంగ్రెస్ చేతిలో బిజెపి ఓడిపోయింది.

పశ్చిమబెంగాల్ సాగర్దిగి ఉప ఎన్నికల్లో, 2011 నుండి టిఎంసి గెలుస్తున్న స్థానాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. 2021లో టిఎంసి స్వల్ప మెజారిటీతో బిజెపిపై గెలిచింది. కాంగ్రెస్–లెఫ్ట్ అభ్యర్థి 23,000 ఓట్లతో గెలిచి బిజెపిని 3వ స్థానంలోకి నెట్టారు.

**పెరుగుతున్న మతపరమైన విభజన :**

**గో పరిరక్షణ సమితి :** రాజస్థాన్‌కు చెందిన ముస్లిం యువకులను నాసిర్, బునాయిద్, హర్యానాలో అతిదారుణంగా సజీవదహనం చేయటం, మతపరమైన విభజనకు వికృత రూపమే. బిజెపి పాలిత రాష్ట్రాలలో, పోలీసులకు గోరక్షకులకి మధ్య ఉన్న సంబంధాల వల్ల గో రక్షకులు చేసే నేరాలకు పూర్తి 'భద్రత' ఉంటున్నది. హర్యానా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చబడినవారిలో ముగ్గురు వారి ఇన్ఫార్మర్స్ అని అంగీకరించారు. పాశవికమైన 2015 హర్యానా చట్టం, భజరంగదళ్ కార్యకర్తలకు లైసెన్సుగా వుండి, ప్రతి జిల్లాలో గో రక్షక బృందంలో చేరేందుకు అవకాశం ఇచ్చింది.

**మతపరమైన పండుగలను ఉపయోగించుకోవడం :** కొద్ది సంవత్సరాలుగా మతపర పండుగలైన రామనవమి, గణేశ్ చతుర్థికి తోడు ఇప్పుడు హనుమాన్ జయంతిని కూడా చేర్చి ప్రచార ఆయుధాలుగా మార్చుకుంటున్నారు. ఈ సందర్భాలలో తీసే ఊరేగింపులు మతపరమైన దౌర్జన్యాలకు, ముస్లింలపై దాడులకు ఉపయోగిస్తున్నారు. ఈ సంవత్సరం రామనవమి రంజాన్ సమయంలో వచ్చింది. మసీదులలో ప్రార్థన చేస్తున్న ముస్లింలను రెచ్చగొట్టడానికి ఉపయోగపడింది. మహారాష్ట్ర, హర్యానా, గుజరాత్, పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాలలో అనేకచోట్ల మతఘర్షణలు జరిగి ప్రాణాలు కోల్పోయారు.

**యుపిలో హత్యలు :** ముస్లిం మైనార్టీలు లక్ష్యంగా, యుపిలో ఆదిత్యనాథ్ ప్రభుత్వం మతపరమైన విభజనకు పదనుపెట్టి నిర్విఘ్నంగా చట్టాల ఉల్లంఘన చేస్తున్నది. ఈ క్రమంలో చట్టాలను అతిక్రమించి బుల్‌డోజర్లు ఉపయోగించి ముస్లిం ప్రజల ఆస్తులను ధ్వంసం చేశారు. బిజెపి, రాష్ట్ర ప్రభుత్వం కలిసి మొత్తం 183 ఎన్‌కౌంటర్ హత్యలు చేశారు. నిజానికి అవి పోలీసు హత్యలే. ఇటువంటి హేయమైన రాజకీయాలలో ఒకటి మొన్న జరిగిన అతీక్ అహ్మద్, అతని సోదరుడు ఆసిఫ్ అహ్మద్‌ల భయంకర హత్యలు. పోలీసు కస్టడీలోనే మీడియా ముందు జరిగాయి. సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో ఒక అత్యున్నత విచారణ కమిటీని నియమించి దీనిపై విచారణ జరపాలి. హంతకులను, వారి పోషకులను గుర్తించి కఠినమైన శిక్ష విధించాలి.

**కర్ణాటక :** ఓబిసిలుగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ కర్ణాటక బిజెపి ప్రభుత్వం చేసిన నిర్ణయంపై సుప్రీంకోర్టు స్టే విధించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేసి హిందూ ఓటు బ్యాంకును బలపరచుకోటానికి చూసింది.

**క్రైస్తవుల మీద దాడులు :** మోడీ ప్రభుత్వం కేరళలో ఉన్న క్రిస్టియన్ల పట్ల మోసపూరిత వైఖరి అవలంబించింది. దేశంలో ఇతరచోట్ల చర్చిలమీద, ముఖ్యంగా గిరిజన క్రిస్టియన్ల మీద దాడులు పెరుగుతున్నాయి. మత విభజనకు అనేక అబద్ధపు కథనాలు అల్లుతున్నారు. గత 9 సంవత్సరాలలో మొదటిసారిగా ప్రధానమంత్రి ఈస్టర్ పండుగ సందర్భంగా ఢిల్లీలోని చర్చిని సందర్శించారు. మేఘాలయ, నాగాలాండు రాష్ట్రాలలో ఎన్నికల్లో 'విజయం' కోసం మోడీ ఈ విధంగా చేయటానికి ప్రధాన కారణం. వారి వాస్తవ లక్ష్యం ఏమంటే కేరళలో చొచ్చుకుపోవటం. ఇక్కడ సుమారుగా క్రిస్టియన్లు 18శాతం, ముస్లింలు 27 శాతం ఉన్నారు. క్రిస్టియన్ కమ్యూనిటీ పట్ల 'సానుభూతి' వ్యక్తం చేస్తూ ముస్లిం వ్యతిరేక భావాలు ప్రచారం చేయాలని చూస్తుంది. కొందరు చర్చి నాయకులు 'లౌవ్ జీహాద్'కు వ్యతిరేకంగా మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ ద్వారా కొన్ని స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని ముస్లిం వ్యతిరేక ప్రచారం చేస్తోంది. ముస్లిం–క్రిస్టియన్‌ల విభజన ద్వారా లాభం పొందాలని చూస్తోంది. కేరళ ప్రజలు ఇటువంటి కుట్రలను ఎదుర్కోగల సామర్థ్యం, చైతన్యం ఉన్నవారు. బిజెపికి తగిన గుణపాఠం చెపుతారు.

**భారతీయ చరిత్రను తిరగరాయడం:** భారత లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని, తీవ్ర ఫాసిస్టు స్వభావం గల హిందుత్వ రాష్ట్రంగా మార్చే తన రాజకీయ ఎజెండాలో భాగంగా, మోడీ ప్రభుత్వం ఎన్‌సిఇఆర్‌టి చరిత్ర పాఠ్య పుస్తకాల సిలబస్‌లో మార్పుల

ద్వారా భారతదేశ చరిత్రను పెద్ద ఎత్తున మార్చి రాసే ప్రక్రియకు పూనుకుంది. ప్రత్యేకమైన హిందుత్వ గుర్తింపుగా దేశాన్ని మార్చడమే దీని లక్ష్యం.

మొఘల్ సామ్రాజ్యం, సుల్తానుల అధ్యాయాలు తొలగించారు. మహాత్మాగాంధీ హత్య, దాని పర్యవసానంగా సర్దార్ పటేల్ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించిన అంశాలు కూడా పాఠ్యపుస్తకాల నుండి తొలగించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మొట్టమొదటి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి సంబంధించిన ప్రస్తావనలు కూడా తొలగించబడ్డాయి. శాస్త్రీయ దృక్పథానికి వ్యతిరేక భావాలు పెంపొందించడానికి డార్విన్ పరిణామం, మెండలీవ్ మరియు ఆవర్తన పట్టిక కూడా తొలగించబడ్డాయి. ఈ మార్పుల ద్వారా ఆధునిక భారతదేశం యొక్క ఎదుగుదలకు దోహదపడిన సమకాలీన భారతీయ చరిత్ర, అత్యున్నత నాగరికతల సమ్మేళనాన్ని అపహాస్యం చేసే ఆలోచనలను మన పిల్లలలో కలిగించే ప్రయత్నాలు చేస్తోంది.

## ఫెడరలిజంపై దాడి

**గవర్నర్ల పాత్ర:** బిజెపియేతర రాష్ట్రాల గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి పని చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీలు రూపొందించిన చట్టాలను నిరాకరించడం ఆనవాయితీగా మారింది. కొంతమంది గవర్నర్లు కేబినెట్ ఆమోదించిన శాసనసభ ఉపన్యాసాలను కూడా మార్చాలని కోరుతున్నారు. ఆయా ప్రభుత్వాలను కాదని సీనియర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, రాష్ట్ర ప్రభుత్వంతో రాజకీయ వివాదాల్లోకి లాగడం వంటి తీవ్ర ఉల్లంఘనలు పెరుగుతున్నాయి. ఇందుకోసం మోడీ తనకు విశ్వాసపాత్రులైన ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, పార్టీ కార్యకర్తలు, రిటైర్డ్ బ్యూరోక్రాట్‌లను ఎంచుకున్నారు. ఫిబ్రవరిలో ఆరుగురు కొత్త గవర్నర్‌లను నియమించారు. వీరిలో నలుగురు ఆర్ఎస్ఎస్/బిజెపికు అనుయాయులు. అయోధ్య వివాదం కేసులో ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చిన ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో భాగమైన రిటైర్డ్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఇది క్విడ్ ప్రోకోకు స్పష్టమైన ఉదాహరణ. అయోధ్య తీర్పుతో సంబంధం ఉన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో రిటైర్ అయిన తర్వాత పదవి చేపట్టిన మూడవ వ్యక్తి. మాజీ చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ రాజ్యసభకు నామినేట్ చేయబడ్డారు. జస్టిస్ అశోక్ భూషణ్ నేషనల్ కంపెనీ ఫర్ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

అసెంబ్లీ ఆమోదించిన చట్టాలను గవర్నర్లు పెండింగులో పెట్టడానికి వ్యతిరేకంగా కేరళ, తమిళనాడు ముఖ్యమంత్రులు ఉమ్మడిగా ఉద్యమించాలని నిర్ణయించారు. రాజ్యాంగంలో నిర్వచించిన సమాఖ్య సూత్రాలను కాపాడుకునేందుకు, గవర్నర్ల ఏకపక్ష చర్యలకు చెక్ పెట్టేందుకు బిజెపి యేతర ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమంలో కలిసిరావాలి. బీహార్, పశ్చిమ బెంగాల్‌లో రామనవమి హింసాకాండ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ముఖ్యమంత్రులను కాదని నేరుగా గవర్నర్‌లతో మాట్లాడారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను ఉల్లంఘించి గవర్నర్లు పాత్ర పోషించాలని వారు భావిస్తున్నారనే దానికి ఇది సంకేతం.

**ఆర్థిక దోపిడీ :** సమాఖ్యవాదంపై దాడిలో భాగంగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలకు వనరుల బదిలీ బాగా తగ్గించింది. ద్రవ్యోల్బణం రేటు 8.4 శాతం ఉన్నప్పటికీ, సంవత్సరం క్రితం 2021-22లో బదిలీ చేసిన వనరులకు సమానంగా మాత్రమే 2022-23లో కూడా ఇచ్చిందని సవరించిన అంచనాలు తెలుపుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు పొందేందుకు బడ్జెట్‌లో మరిన్ని షరతులను విధించింది.

వాస్తవానికి, జిడిపి నిష్పత్తి ప్రకారం రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన వాటా తగ్గుతున్నది. కేంద్రానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటాను 42 శాతానికి పెంచుతూ 14వ ఆర్థిక సంఘం నిర్ణయం చేసింది. దీనికి భిన్నంగా, 2021-22లో 33.2 శాతం, 2022-23 సవరించిన అంచనా ప్రకారం 31.2 శాతం మరియు 2023-24 బడ్జెట్‌లో 30.4 శాతం మాత్రమే ఇచ్చాయి.

## తీవ్రమవుతున్న ఆధిపత్యవాదం

బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ తమ రాజకీయ లక్ష్యాలను మరింతగా ముందుకు తీసుకెళ్ళే దిశగా ఇడి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను ఇడి అరెస్టు చేయడంతో ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీదేవి, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌లను సీబీఐ ప్రశ్నిస్తోంది. ఢిల్లీలోని తేజస్వీ యాదవ్ ఇల్లు, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లపై 24 ప్రాంతాల్లో ఈడీ దాడులు చేసింది. ఈ రెండు సంస్థలు సమిష్టిగా పనిచేస్తాయి. సీబీఐ దర్యాప్తు నివేదికను దాఖలు చేస్తుంది. మనీ ల్యాండరింగ్ కేసు కోసం ఇడి దీనిని ఉపయోగించుకుంటుంది.

మోడీ ప్రభుత్వం కేంద్ర సంస్థలను ఆయుధంగా మార్చుకుని ప్రతిపక్షాలపై దాడికి పాల్పడుతున్నది. ఆయా పార్టీల ముఖ్య నేతలను లక్ష్యంగా చేసుకుని, ఎటువంటి

విచారణ లేకుండా ఎక్కువ కాలం జైలులో ఉంచడం ద్వారా ప్రతిపక్ష పార్టీలను గందరగోళంలోకి నెట్టడానికి నిస్సిగ్గుగా ఈ సంస్థలను ఉపయోగించుకుంటున్నది. అంతేకాకుండా, కొంతమంది నాయకులను ఎంపిక చేసుకుని ఫిరాయింపులకు ఉసిగొల్పుతూ ప్రతిపక్ష పార్టీలను విభజించడానికి ప్రయత్నిస్తున్నది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సీబిఐ ప్రశ్నించడం ప్రారంభించింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కుమార్తె, బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవితకు ఈడీ సమన్లు జారీ చేసి ప్రశ్నించింది.

ఇతర పార్టీల నుంచి బిజెపిలో చేరినవారిని అప్పటికే ఉన్న కేసుల నుంచి కాపాడారు. అస్సాం ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉన్నప్పుడు శారదా కుంభకోణంలో సిబిఐ విచారణను ఎదుర్కొన్నారు. ఆయన బిజెపిలో చేరిన తర్వాత తదుపరి చర్యలు లేవు. సువెందు అధికారి, పశ్చిమ బెంగాల్; నారాయణ్ రాణే, మహారాష్ట్ర వంటి ఉదాహరణలు మరెన్నో ఉన్నాయి. ఈడీ రాజకీయ నాయకులపై పెట్టిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి.

## రాహుల్ గాంధీపై అనర్హత వేటు

ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ఎంపీలుగా అనర్హులుగా ప్రకటించేందుకు బిజెపి నేరపూరిత పరువు నష్టం మార్గాన్ని ఎంచుకుంది. రాహుల్ గాంధీకి శిక్ష విధించడం, అనర్హత వేటు విషయంలో దేశవ్యాప్తంగా వస్తున్న విమర్శలపై తన అసహనాన్ని బహిరంగంగానే వ్యక్తం చేసింది. ఆ పార్టీ తన నిరంకుశ స్వభావాన్ని ఇటువంటి చర్యల ద్వారా బిజెపి నిస్సిగ్గుగా బయట పెట్టుకుంది.

**పెరుగుతున్న బెదిరింపులు:** 'మోడీ ప్రశ్న' అనే డాక్యుమెంటరీని బిబిసి ప్రసారం చేసిన వెంటనే ఢిల్లీ, ముంబైలోని బిబిసి కార్యాలయాలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు చేసింది. సోదాల ద్వారా జాతీయ మీడియాను భయపెట్టడానికి మోడీ ప్రభుత్వం అనుసరించిన ఎత్తుగడ ఇప్పుడు భారతదేశంలో పనిచేస్తున్న విదేశీ మీడియాకు విస్తరింపజేసింది. బిబిసిపై సిబిఐ విచారణ కొనసాగుతోంది.

భారతదేశంలోని ఆర్థిక సంపద అసమానతలపై ఆక్స్‌ఫామ్ ఇండియా విలువైన సమాచారాన్ని అందిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎను ఉల్లంఘించారనే ఆరోపణలపై ఢిల్లీలో ఆ సంస్థ కార్యాలయంపై సిబిఐ దాడి చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

**సెన్సార్‌షిప్ కఠినతరం** : కేంద్ర ప్రభుత్వం గురించి ఏదైనా "నకిలీ, లేదా తప్పుడు లేదా తప్పుదారి పట్టించే" సమాచారాన్ని తనిఖీ చేయడానికి ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను వాటిని తొలగించమని అడగడానికి

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి)కి అధికారాలు ఇస్తూ 2021లో ఐటి రూల్స్ సవరించారు.

## స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను అణగదొక్కడం

**పార్లమెంట్**: ఇటీవల ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయి. హిండెన్‌బర్గ్ నివేదిక, ప్రభుత్వం – అదానీ సంస్థల మధ్య సంబంధాలకు సంబంధించిన ప్రశ్నలు వేటినీ ఎదుర్కోడానికి మోడీ ప్రభుత్వం, పాలక పక్షం నిర్లజ్జగా తిరస్కరించాయి. రాహుల్ గాంధీ విదేశాల్లో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని కోరడం ఒక సాకు మాత్రమే. ప్రభుత్వమే పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకునే కుతంత్రాన్ని కప్పిపుచ్చుకోడానికి ఈ సాకు చూపింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా క్రోనీ క్యాపిటలిజానికి సంబంధించి మోదీ ప్రభుత్వానికి, అదానీ సంస్థలకు మధ్య ఉన్న సంబంధాలపై లేవనెత్తిన ప్రశ్నలను స్వల్ప కారణాలతో ఉభయ సభల ప్రిసైడింగ్ అధికారులు తొసిపుచ్చాయి. భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇదొక అసాధారణ పరిస్థితి పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాల్సిన రాజ్యాంగ బాధ్యతను మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ప్రభుత్వం ఎలాంటి చర్చలు, వాదోపవాదాలు లేకుండానే గందరగోళం మధ్య అప్రజాస్వామికంగా చట్టాలను ఆమోదింపజేసుకుంది. బడ్జెట్‌ను సైతం నిమిషాల వ్యవధిలో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించారు.

**న్యాయవ్యవస్థ**: న్యాయవ్యవస్థ నియామకాలను నియంత్రించాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. దీని కొనసాగింపే కేంద్ర న్యాయ మంత్రి, ఉపరాష్ట్రపతి వంటి రాజ్యాంగ నేతల ప్రకటనలు. కొలీజియం ఏకగ్రీవంగా చేసిన ప్రతిపాదనలను ఆమోదించడంలో మోడీ ప్రభుత్వం చేస్తున్న తీవ్ర జాప్యం న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేదిగా ఉంది. ఇటువంటి వ్యూహాల ద్వారా, మోడీ ప్రభుత్వం తమకు అనుకూలమైనవారిని నియమించడానికి, వ్యతిరేకమైన నియామకాలను ఆలస్యం చేయడం మరియు సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలను సుప్రీంకోర్టుకు వెళ్లకుండా నిరోధించడానికి ప్రయత్నిస్తోంది. కొలీజియం సిఫార్సులపై స్పందించడానికి ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఒక నిర్దిష్ట కాలపరిమితి ఉండాలి.

**అటవీ పరిరక్షణ చట్ట సవరణ**: పార్లమెంటులో ఈ సవరణ గందరగోళం మధ్య ప్రవేశపెట్టి జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేశారు. వాస్తవానికి దీనిని పర్యావరణం, అటవీ వాతావరణ మార్పుల కోసం ఏర్పాటు చేసిన స్టాండింగ్

కమిటీకి సిఫార్సు చేయాల్సి ఉంది. కానీ ఈ స్టాండింగ్ కమిటీ ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకుడి అధ్యక్షతన ఉంది కాబట్టి బైపాస్ చేశారు. ఈ సవరణలు, తమ ప్రాంతాలలో ఏదైనా ప్రాజెక్ట్ కోసం సమ్మతిని ఇవ్వడానికి లేదా నిలిపివేయడానికి గ్రామసభలకు ఉన్న రాజ్యాంగ, చట్టపరమైన హక్కులను తొలగిస్తాయి. అటవీ భూముల మళ్లింపు కోసం నిబంధనలను సరళీకరించడం, అడవుల ప్రైవేటీకరణను ప్రోత్సహించడం, అటవీ పాలనపై రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కుదించి కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలు కట్టబెడుతుంది. ఇది ఆదివాసీలు సాంప్రదాయ అటవీ నివాసుల హక్కులపై మరింత దాడి. ప్రస్తుత అటవీ హక్కుల చట్టాన్ని బాహాటంగా ఉల్లంఘించడమే. ఇది వాతావరణ మార్పుల లక్ష్యాలపై కూడా వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుంది.

## జనాభాగణన – కుల గణన

చాలా కాలంగా పెండింగులో ఉన్న 2021 జనాభా గణనను కోవిడ్ మహమ్మారి అనంతరం పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో, ఇప్పుడు తప్పనిసరిగా చేపట్టాలనే వైఖరిని పార్టీ తీసుకుంది. ఈ సాధారణ జనాభా గణనలో కులగణన భాగం కావాలి. ఒక శతాబ్దానికి పైగా ఉన్న జనాభా గణన వలన సాధారణ కార్యకలాపాలకు ఎప్పుడూ అంతరాయం కలగలేదని, ప్రపంచయుద్ధాల సమయంలో కూడా (రెండో ప్రపంచ యుద్ధ సమయంలో,1941లో కుదించబడిన జనాభాగణన నిర్వహించబడింది) క్రమబద్ధంగా పదేళ్ల వ్యవధిలో నిర్వహించబడుతుందని గమనించాలి. జానాభా గణనలో ఇంతటి జాప్యం జరగడం ఇదే మొదటిసారి. మోదీ హయాంలోనే ఇలా జరిగింది.

## ప్రతిపక్షాల వ్యూహం

హిండెన్‌బర్గ్ బహిర్గతం చేసిన అదానీ గ్రూపు సంస్థల అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేయడానికి పార్లమెంటులోని ఆప్, టిఎంసితో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రారంభంలో సంయుక్తంగా కదిలాయి. ఆ తర్వాత పార్లమెంట్‌లో ఉమ్మడి ప్రతిపక్ష పార్టీల సమావేశాలకు టీఎంసి హాజరుకావడం మానేసింది.

జి8గా పిలువబడే ఢిల్లీ, పంజాబ్, బీహార్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, జార్ఖండ్, కేరళ రాష్ట్రాల నుండి బిజెపియేతర, కాంగ్రెసేతర ముఖ్యమంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయడానికి ఆప్ ప్రయత్నాలు ప్రారంభించింది.

విపక్షాల పాక్షిక ఐక్యత రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించడానికి విఘాతంగా మారుతుంది. బిజెపియేతర ముఖ్యమంత్రులందరూ సంయుక్తంగా కానీ లేదా ఇతర రూపాల్లో కానీ రాష్ట్రాల హక్కులు, సమాఖ్యవాదంపై దాడులను ఎండగట్టాలని మనం ప్రతిపాదించాము.

ఈడి వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ 18 ప్రతిపక్ష పార్టీలు సంయుక్తంగా పిటిషన్ దాఖలు చేశాయి. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను స్వీకరించలేదు. 2014 నుండి ఈడి నమోదు చేసిన 3,500 కేసులలో (ఒక అంచనా ప్రకారం, 95 శాతం కేసులు ప్రతిపక్షపార్టీల నాయకులపై ఉన్నాయి) 25 మాత్రమే కోర్టు ముందుకు వచ్చాయి. 23 మంది దోషులుగా నిర్ధారించబడ్డారు. ఆ తర్వాత బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఢిల్లీకి వెళ్లి బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నింటినీ ఏకం చేయాలని కోరుతూ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల నేతలను కలిశారు. విపక్షాల ఎత్తుగడలు క్రియాశీలకంగా ఉన్నాయి. ఈ సమీకరణలు రాబోయే రోజుల్లో మారే అవకాశం వుంటుంది.

23వ పార్టీ మహాసభ అనంతరం, బిజెపి వ్యతిరేక ఓట్లను కూడగట్టేందుకు మనం త్రిముఖ వ్యూహాన్ని రూపొందిస్తున్నాము. మతపరమైన విభజనకు పదును పెట్టడం, ద్వేషపూరిత విష ప్రచారాలు, అదానీ కుంభకోణం, కేంద్ర సంస్థల దుర్వినియోగం, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ అవినీతిని చట్టబద్ధం చేయడం, సాధారణ జనాభా గణనతో పాటు కుల గణన కోసం డిమాండ్ వంటి దేశవ్యాపిత ప్రాముఖ్యం గల అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఫెడరలిజంపై దాడులకు వ్యతిరేకంగా లౌకిక ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేయడం. ***మొదటిది:*** ఈ సమస్యలను ప్రజల ముందుంచాలి. ***రెండోది:*** ప్రతి రాష్ట్రంలో, నిర్దిష్ట పరిస్థితిని బట్టి, ఎన్నికలలో బిజెపిని ఎదుర్కోవడానికి గరిష్టంగా లౌకిక ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయడానికి వ్యూహాలు రూపొందించాలి. ఆయా రాష్ట్రాలలో మారిన పరిసిత్థుతులను బట్టి నిర్దిష్టంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. ***మూడవది:*** ప్రజల జీవనోపాధికి సంబంధించిన సమస్యలపై జరిగే పోరాటాలు, నిరసన కార్యక్రమాలలో మోడీ ప్రభుత్వ విధానాలు, మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాతంత్ర శక్తులను సమీకరించడం ప్రారంభించాలి. ఈ మూడు అంశాలు ఏకకాలంలో కొనసాగాలి.

## త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, చట్టసభలు,

రాజ్యాంగ పరిరక్షణ కోసం బిజెపి వ్యతిరేక శక్తులన్నింటినీ కూడగట్టేందుకు పార్టీ ప్రయత్నించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీతో సీట్ల సర్దుబాటు చేసుకుంది. అయితే పూర్వపు గిరిజన రాజవంశ వారసుల నేతృత్వంలోని తిప్రామోతా పార్టీ తెరపైకి తీసుకురాడంతో మనం విజయం సాధించలేకపోయాము. లెఫ్ట్ ఫ్రంట్ 46 స్థానాల్లో పోటీ చేసింది. ఒకచోట స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ఇచ్చింది. ఇందులో సీపీఐ(ఎం) 43, కాంగ్రెస్ 13 స్థానాల్లో పోటీ చేసింది.

బిజెపి-ఐపిఎఫ్‌టి కూటమి (55+5) 40.29శాతం ఓట్లతో 33 స్థానాలను గెలుచుకుంది. ఇందులో బిజెపికి 32 స్థానాలు. లెఫ్ట్ ఫ్రంట్ 11 సీట్లు (మొత్తం సిపిఐఎం) గెలుచుకుంది. 27.46 శాతం ఓట్లు పోలయ్యాయి. 2018లో లెఫ్ట్‌కు 16 సీట్లు ఉన్నాయి. 8.57 శాతం పోలింగ్‌తో కాంగ్రెస్ 3 స్థానాల్లో విజయం సాధించింది. వామపక్షాలు, కాంగ్రెస్ కలిసి 36 శాతానికి పైగా ఓట్లు సాధించాయి. తిప్రామోతా 19.1 శాతం పోలింగ్‌తో 13 సీట్లను గెలుచుకుని, బిజెపి గెలుపునకు సహాయపడింది.

**ఎన్నికల అనంతర హింస**: ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని, ప్రధానంగా మన పార్టీపై బిజెపి భయంకరమైన దాడికి దిగింది. బెదిరింపులు, దోపిడీలు పార్టీ కార్యాలయాల, ఇళ్లకు నిప్పు పెట్టడం, ఆస్తులు, జీవనోపాధి సాధనాలైన రిక్షాలు, మూడు చక్రాల వాహనాలను ధ్వంసం చేయడం, పంటల నాశనం, ముఖ్యంగా రబ్బరు తోటలు, చేపల చెరువులు మొదలైనవి విషపూరితం చేయడం ఇలా వెయ్యికి పైగా భయాందోళనలు కలిగించే ఘటనలు వంటి ఎన్నికల ఫలితాలు వెలువడిన తరవాత జరిగాయి. సిపిఐ(ఎం), సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఏడుగురు పార్లమెంటు సభ్యుల బృందం త్రిపురలో పర్యటించింది. పోలీసుల సమక్షంలోనే ఈ బృందంపై బిజెపి దాడి చేసింది. గవర్నర్‌కు సవివరమైన మెమోరాండం ఇచ్చినప్పటికీ నిందితులను పట్టుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పార్టీ అఖిలభారత కమిటీ పిలుపు మేరకు దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. త్రిపుర రాష్ట్ర కమిటీ సమగ్ర ఎన్నికల సమీక్ష చేపట్టింది. (దీనిని విడిగా సర్క్యులేట్ చేయడం జరుగుతుంది.)

## జమ్మూ & కాశ్మీర్ పరిస్థితి

జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియ, ఓటర్ల జాబితాల అప్‌గ్రేడేషన్ పూర్తయినప్పటికీ 2018 నుండి ఈ ప్రాంతంలో శాసనసభ ఎన్నికలు లేవు. దీంతో ఆ ప్రాంతంలో రాజకీయ శూన్యత నెలకొంది. పాలక ప్రభుత్వం పదేపదే హామీలు ఇచ్చినప్పటికీ, రాజ్యాంగ విరుద్ధంగా అత్యంత

హేయమైన పద్ధతిలో వీటి అమలుకు నిరాకరించింది. ఇది ప్రజల ప్రాథమిక రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కులను ఉల్లంఘించడమే. ఆలస్యంగానైనా జమ్ము కాశ్మీర్ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘాన్ని కలిసి ముందస్తు ఎన్నికలు కోరుతూ మెమోరాండం సమర్పించాయి. రాజ్యాంగ హక్కుల రద్దు, పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు సుప్రీంకోర్టులో ఇంకా విచారణలో ఉన్నాయి.

జనాభా పొందికలో మార్పు తేవాలనే ఉద్దేశంతో స్థానికేతరులకు ఆస్తి, ఉద్యోగం, ఓటింగ్ హక్కు కల్పించడం వంటివి తీసుకొచ్చింది రాష్ట్ర హోదాకు మార్పు వంటి తీవ్ర ప్రభావితం చేసే ప్రభుత్వ చర్యలు, భూ చట్టాల్లో మార్పు; జమ్మూ మరియు కాశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ రద్దు; పిఎస్ఎ, యుఏపిఏ వంటి క్రూరమైన చట్టాలను యథేచ్ఛగా ఉపయోగించడం; యువకులను జర్నలిస్టులను దేశంలోని వివిధ జైళ్ళలో నిర్బంధించడం వంటి దారుణాలు ప్రజలలో కోపం, తీవ్రమైన నిరాశ, నిస్పృహలను కలిగించింది. కేంద్రం అణచివేసే భద్రతా వ్యవస్థ నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించి అధికార యంత్రాంగంపై ఆధారపడడం వల్ల సామాన్యులకు పాలనా యంత్రాంగానికి మధ్య అగాధం పెరుగుతోంది.

పెరుగుతున్న నిరుద్యోగం, అవినీతి ప్రజల్లో అనిశ్చితిని పెంచుతున్నాయి. తాజాగా రాజౌరి సెక్టార్‌లో ఆర్మీ వాహనంపై దాడి చేసి ఐదుగురు జవాన్లను చంపడం ఇందుకు ఉదాహరణ. జమ్మూ, లడఖ్ ప్రాంతాల ప్రజల్లోనూ ఇతర వర్గాలలో అసంతృప్తి, నిరాశ నిస్పృహ పెరుగుతున్నాయి. మొట్టమొదటిసారిగా లేహ్, కార్గిల్ ప్రాంతాల నాయకత్వం తమ చారిత్రక విభేదాలను అధిగమించి మొట్టమొదటి సారి ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసుకున్నాయి. స్థానికుల హక్కులు, వనరులు, భూములు, పర్యావరణం కాపాడుకోనేందుకు లడఖీయులకు రాజకీయ అధికారం కావాలని కోరాము.

## సత్యపాల్ మాలిక్ ఇంటర్వ్యూ

పుల్వామా ఉగ్రవాద దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై వచ్చిన ఆరోపణలు మన దేశ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశాన్ని ముందుకు తెచ్చాయి. మన జాతీయ భద్రతా పరిరక్షణ ఎలాంటి లోపాలు జరగలేదనేది జమ్మూ & కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, వెబ్ పోర్టల్ 'ది వైర్' కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నిర్ఘాంతపోయే ఆరోపణలు చేశారు. మోడీ ప్రభుత్వం ఎప్పటిలాగే ఈ ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా ఇంటెలిజెన్స్, ఆపరేషన్

లోపాలను గవర్నర్ లేవనెత్తినప్పుడు, ఆయనను మౌనంగా ఉండమని కోరినట్లు పేర్కొనడం నిజంగా ఘోరమైన విషయం. జవాన్లను తరలించేందుకు విమానాలు సమకూర్చాలని ఆర్‌పిఎఫ్ కోరితే ఎందుకు పంపలేదు. పుల్వామా ఘటనకు జరగడానికి ముందురోజు ఆర్‌డిఎక్స్ దట్టించిన కారు ఈ ప్రాంతంలో తిరుగుతున్నదని ఇంటిలిజెన్స్ ఇచ్చిన సమాచారాన్ని ఏం చేశారు? రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఎ రద్దు చేసిన విధానం మరియు జమ్మూ & కాశ్మీర్ రాష్ట్ర హోదా రద్దు చేసి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చిన తీరుపై వచ్చిన ఆరోపణలు కూడా అంతే తీవ్రమైనవి. దీనిపై పార్లమెంటులో చట్టం రూపొందించే సందర్భంలో, 2019 ఆగస్టు 4 సాయంత్రం తనకు లేఖ అందిందని, అది కూడా మరుసటి రోజు ఉదయం మాత్రమే దానిని తెరవాలనే ఆదేశాలతో ఇచ్చారని మాజీ గవర్నర్ ఆరోపించారు.

## పెరుగుతున్న ప్రజా నిరసనలు

**మజ్దూర్–కిసాన్ సంఘర్ష్ ర్యాలీ**: ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగిన ర్యాలీలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు అనేక మంది దిగజారుతున్న పని, జీవన పరిస్థితులపై 12 పాయింట్ల డిమాండ్ చార్టర్‌తో, మోడీ ప్రభుత్వ నయా ఉదారవాద విధాన ఎజెండాను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన ఈ ర్యాలీ, భారీ బహిరంగ సభకు ముందు దేశవ్యాప్తంగా జరిగిన ప్రచారం మంచి ప్రభావం చూపింది.

**రైతు పోరాటాలు**: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎమ్) మార్చి 20న ఢిల్లీ రాంలీలా మైదానంలో నిర్వహించిన కిసాన్ మహా పంచాయితీ (బహిరంగ సభ)లో పెద్దఎత్తున పాల్గొన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీ చట్టం కోసం గతేడాది ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రికి ఎస్‌కెఎమ్ మెమోరాండం సమర్పించింది. వ్యవసాయంలో పెరుగుతున్న కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలను చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చింది.

**మహారాష్ట్ర లాంగ్ మార్చ్:** 15 పాయింట్ల డిమాండ్లపై మహారాష్ట్ర కిసాన్ సభ మార్చి 12న నాసిక్ నుండి ముంబై వరకు లాంగ్ మార్చ్ ప్రారంభించింది. 2018 లాంగ్ మార్చ్ దేశవ్యాప్తంగా రైతు పోరాటాలను ఉధృతం చేసింది.

ప్రధానంగా ఉల్లితో పాటు పత్తి, సోయాబీన్ వంటి ఇతర పంటలకు గిట్టుబాటు ధర డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ లాంగ్ మార్చ్ ముంబై వైపు

వెళుతుండగా, షిండే–బిజెపి ప్రభుత్వం డిమాండ్ చార్టర్‌పై నాయకులను చర్చలకు పిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లిపాయలకు క్వింటాల్‌కు రూ. 350 సబ్సిడీ ప్రకటించింది. 88,000 మంది రైతులకు రుణ మాఫీ, అటవీ హక్కుల చట్టం అమలు కోసం కమిటీ ఏర్పాటుకు హామీ ఇచ్చింది. ఈ నిర్ణయాలను రాష్ట్ర అసెంబ్లీ ముందు ఉంచి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసేవరకు లాంగ్ మార్చ్ ఉపసంహరించుకోరాదని రైతులు నిర్ణయించారు. అసెంబ్లీ ఆమోదించిన తర్వాత మార్చి 18న ఉపసంహరించుకున్నారు.

## కార్మికోద్యమ ఆందోళనలు

**విద్యుత్ కార్మికుల సమ్మె:** అనేక రాష్ట్రాలలో ప్రధానంగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలలో విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేశారు. కార్మికుల ఐక్య పోరాటం, ధృఢ సంకల్పం ముందు బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు తలవంచక తప్పలేదు. అదానీ గ్రూప్‌కు సమాంతర లైసెన్స్ మంజూరు ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటామని మహారాష్ట్ర ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇచ్చింది. 86,000 మంది కార్మికులు, ఉద్యోగులు 72 గంటల సమ్మెలో పాల్గొన్నారు. దీంతో కార్మికులను తొలగించిన తన చర్యను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. కర్ణాటకలో లక్ష మందికి పైగా కార్మికులు పాల్గొనడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతన సవరణపై అనివార్యంగా చర్చలు జరపాల్సి వచ్చింది.

మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాలలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అనేక సమస్యలపై కదిలారు. కర్నాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఒడిశా తదితర రాష్ట్రాలలో యుపి బిజెపి ప్రభుత్వం నిర్బంధాన్ని వీరోచితంగా ఎదిరించి. అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కీమ్ వర్కర్లు పెద్దఎత్తున పోరాటాలు చేశారు. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా సమ్మెకు దిగారు.

## రెజ్లర్ల ఆందోళన

లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేస్తున్న భారత పతక విజేతలైన రెజ్లర్లు చేపట్టిన వివిధ వర్గాల నుండి మద్దతు సంఘీభావం లభిస్తున్నది. ప్రారంభంలో విముఖత చూపినా, విషయం సుప్రీంకోర్టు దాకా వెళ్ళడంతో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసి వచ్చింది. డబ్ల్యుఎఫ్ఐ

అధ్యక్షుడిని పదవి నుండి తొలగించాలి. తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్న డిమాండ్‌పై పోలీసులు తక్షణమే స్పందించాలి.

**కేంద్ర కమిటీ పిలుపులు :**

1. దేశాన్ని పట్టిపీడిస్తున్న, తక్షణ సమస్యలపైన జీవనోపాధిని దెబ్బతిస్తున్న అంశాలపైన వామపక్ష పార్టీలను కలుపుకుని దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలి.
2. లౌకిక ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని, జాతీయంగా ప్రాముఖ్యత కలిగిన అంశాలను, ఆందోళనల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి.
3. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, ముఖ్యమైన రాష్ట్రాల ఎన్నికల సన్నాహాల్లో భాగంగా, ఆయా రాష్ట్రాల నిర్దిష్ట పరిస్థితుల ఆధారంగా లౌకిక ప్రతిపక్ష పార్టీలతో అవగాహన/సీట్ల సర్దుబాట్లకు పార్టీ రాష్ట్ర కమిటీలు గట్టి ప్రయత్నాలు చేయాలి.
4. విద్యావేత్తలు, మేధావులు, కళాకారులతో కూడిన రాష్ట్ర స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల సిలబస్‌లో నూతన విద్యా విధానం 2020 ద్వారా ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన విపరీత మార్పులకు వ్యతిరేకంగా ప్రధానమైన కేంద్రాలలో సమావేశాలు, చర్చాగోష్టులు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి.

***

**ప్రతులు : *1000*,** **ప్రచురణ కాలం : మే, 2023,** **వెల : ₹. 10/-**

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

**27-13-3, గవర్నర్‌పేట, విజయవాడ - 2,**

**ఫోన్ నెం. 0866 2577202, 9490099057**